క్లుప్తంగా

ఎంపీడీఓకు సన్మానం



శ్రీనివాస్‌ను సన్మానించిన కార్యదర్శులు

మంచాల: ఉత్తమ ఎంపీడీఓ అవార్డు అందుకున్న మంచాల మండల అభివృద్ధి అధికారి చిలుకూరి శ్రీనివాస్‌ను మంగళవారం మండల కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు ఘనంగా సన్మానించారు. ఉత్తమ ఎంపీడీఓగా గుర్తించి అవార్డు అందజేయడంపట్ల శ్రీనివాస్ సంతోషం వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాలను అర్హులకు అందించే విధంగా కృషిచేస్తామన్నారు. ఎంపీఓ తేజ్ సింగ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

డీసీపీ శ్రీనివాస్‌కు సన్మానం



డీసీపీ శ్రీనివాస్‌తో పోలీసులు

ఇబ్రహీంపట్నం రూరల్: మహేశ్వరం డీసీపీగా బాధ్యతలు స్వీకరించిన చింతమనేని శ్రీనివాస్‌కు ఇబ్రహీంపట్నం పోలీసులు శుభాకాంక్షలు తెలిపారు. ఇబ్రహీంపట్నం ఏసీపీ ఉమామహేశ్వర్‌రావు, ఆదిబట్ల సీఐ రవికుమార్, ఇబ్రహీంపట్నం సీఐ రామకృష్ణ, కందుకూర్ సీఐ కృష్ణరాజు సోమవారం శ్రీనివాస్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరు విధి నిర్వహణలో బాధ్యతగా వ్యవహరించాలని డీసీపీ సూచించారు.

మన ఊరు- మనబడితో సౌకర్యాలు మెరుగు

కడ్తాల్: మన ఊరు మనబడి పథకంతో పాఠశాలల్లో సౌకర్యాలు మరింత మెరుగుపడుతున్నాయి. కడ్తాల్ మండలంలో 18 పాఠశాలల్లో మన ఊరు–మన బడి పథకం క్రింద అభివృద్ధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రత్యేకించి బుధవారం ప్రారంభించనున్న సాలార్‌పూర్ ప్రాథమిక పాఠశాలలో విద్యుదీకరణ, డ్రింకింగ్ వాటర్ సదుపాయం, మరమ్మతులు, టాయిలెట్ల నిర్మాణం, ప్రహరీ నిర్మాణం, వంటగది నిర్మాణాలు, పాఠశాలకు రంగులు వేయడం తదితర పనులు పూర్తయ్యాయి. పాఠశాలలో జరిగిన అభివృద్ధి పనుల పట్ల గ్రామ ప్రజలు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.

పట్టా పాసుపుస్తకాలు ఇవ్వండి: సీపీఎం

మంచాల: నిరుపేదలు సాగు చేసుకుంటున్న లావని భూములకు పట్టా పాసుపుస్తకాలు ఇవ్వాలని సీపీఎం మండల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం మంచాల తహసీల్దార్ కె.అనితకు ఈమేరకు వినతిపత్రం అందజేశారు. గత 50 సంవత్సరాలుగా పేదలు వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్న లావని పట్టా భూముల విషయంలో న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు యాట వెంకటేష్, రాజు, రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి



సాలయ్యను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

యాచారం: ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరని.. విధుల్లో ఉన్నన్ని రోజులు అంకితభావంతో పనిచేస్తే తగిన గుర్తింపు వస్తుందని గునుగల్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం భాస్కర్ పేర్కొన్నారు. పాఠశాల అటెండర్ సాలయ్య పదవీ విరమణ సభ మంగళవారం పాఠశాల ఆవరణలో జరిగింది. హెచ్‌ఎం భాస్కర్ మాట్లాడుతూ.. సాలయ్య గునుగల్ ఉన్నత పాఠశాలలో 23 ఏళ్లుగా సేవలు అందించినట్లు తెలిపారు. విధి నిర్వహణలో ఎక్కడా కూడా నిర్లక్ష్యం చేయలేదని అన్నారు. పదవీ విరమణ పొందుతున్న సాలయ్యను, అతడి కుటుంబ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఆయన శేష జీవితం ప్రశాంతంగా గడపాలని ఆకాంక్షించారు. పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

తలకొండపల్లి: మండల కేంద్రానికి చెందిన సంపత్‌కుమార్ ప్రమాదంలో గాయపడి హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిల్లో చికిత్స తీసుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుజ్జుల మహేశ్ మంగళవారం ఆస్పత్రికి వెళ్లి సంపత్‌కుమార్ ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకున్నాడు. వ్యక్తిగతంగా రూ.5000 ఆర్థిక సహాయం అందజేశారు. యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ కార్యదర్శి రవీందర్ యాదవ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో..

తలకొండపల్లి గ్రామానికి చెందిన సంపత్‌కుమార్ ప్రమాదవశాత్తు గాయపడి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ మంగళవారం ఆస్పత్రికి తక్షణ సహాయంగా రూ.51,000 అందజేశారు. కార్యక్రమంలో మహేశ్, రవి, శేఖర్, విఠల్, మల్లేశ్, నరేష్, నర్సింహ పాల్గొన్నారు.

ఉత్సవాలకు ముస్తాబు

- నేటి నుంచి లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు
- ప్రత్యేక ఏర్పాట్లు చేసిన నిర్వాహకులు

కడ్తాల్: మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబయ్యింది. బుధవారం ప్రారంభమయ్యే ఉత్సవాలు ఈనెల 7వతేదీ వరకు (వారంరోజుల) పాటు కొనసాగుతాయి. ఆలయ బ్రహ్మోత్సవ పర్యవేక్షకులు, ఈఓ మోహన్‌రావు, ప్రధాన అర్చకులు వెంకటేశ్వర శర్మ ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరారు.

ప్రత్యేక ఆకర్షణగా రథోత్సవం..

చెన్నకేశవస్వామి జాతర ఉత్సవాల్లో పెద్ద రథోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలను రథంపై గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగిస్తారు. నియోజకవర్గంలోనే అతిపెద్ద తేరుగా కడ్తాల్ శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలోని తేరు గుర్తింపు పొందింది. రథోత్సవంలో పాల్గొనడానికి గ్రామంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివస్తారు. శ్రీశైలం–హైదరాబాద్ ప్రధాన రహదారిపై కడ్తాల్ మండల కేంద్రానికి ప్రతి ఐదు నిమిషాలకు ఒక ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉందని భక్తులు గమనించాలని జాతర నిర్వాహకులు తెలిపారు.



స్వామివారి మూలవిరాట్



లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయ ప్రాంగణంలోని రథం

కంటివెలుగును సద్వినియోగం చేసుకోవాలి

ఎంపీపీ కృపేశ్

ఇబ్రహీంపట్నం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకువచ్చిన కంటివెలుగు పథకాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కృపేశ్ పేర్కొన్నారు. మండలం పరిధిలోని కప్పపహాడ్‌లో కంటి వెలుగు కార్యక్రమాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. కంటిచూపు సరిగా లేని వారందరికీ పరీక్షలు చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ హంసమ్మ, ఎంపీటీసీ భరత్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి విక్రం, వైద్యాధికారి నాగయ్య, భాగ్యలక్ష్మి, వార్డు సభ్యులు పావనీ, అరుణ, ఇందిరా, బౌరమ్మ, గణేష్, బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు జలేందర్ తదితరులు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం రూరల్: కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ కృపేశ్

350 మందికి పరీక్షలు

తలకొండపల్లి: మండల కేంద్రం, పూల్‌సింగ్‌తండాలో నిర్వహిస్తున్న కంటి వెలుగు వైద్య శిబిరాల్లో మంగళవారం 350 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు సైదమ్మ, కల్పన, శ్వేత, రామకృష్ణ, హెచ్‌ఏమల్లయ్య, రామచంద్రయ్య, మాధవి, స్వాతి, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

చింతుల్ల గ్రామంలో..

యాచారం: గ్రామస్తులంతా కంటి పరీక్షలు చేయించుకోవాలని ఎంపీడీఓ విజయలక్ష్మి సూచించారు. మండల పరిధిలోని చింతుల్ల గ్రామంలో నిర్వహిస్తున్న కంటివెలుగు కేంద్రాన్ని ఆమె మంగళవారం సందర్శించారు. అలాగే చింతుల్ల గ్రామంలో బుధవారం ప్రారంభించనున్న మన ఊరు–మన బడి పాఠశాలను ఎంపీడీఓ విజయలక్ష్మి మంగళవారం సందర్శించారు. పనులను పరిశీలించారు. గ్రామ సర్పంచ్ సబిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ బలోపేతానికి కృషి



ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన వినోద్‌కుమార్

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మండల ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు, లయన్ పసునూరి వినోద్‌కుమార్ మంగళవారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి టీఆర్‌ఎస్ కండువా కప్పి వినోద్‌కుమార్‌ను పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వినోద్ కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశం మొత్తం అమలు కావాలంటే బీఆర్‌ఎస్‌ను కేంద్రంలో అధికారంలోకి తీసుకురావడానికి ప్రతిఒక్కరూ కృషిచేయాలన్నారు. బీఆర్‌ఎస్‌లో చేరేందుకు ప్రోత్సహించిన మున్సిపల్ అధ్యక్షుడు అల్వాల వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్ పద్మమల్లేష్ యాదవ్‌కు ఈ సందర్భంగా వినోద్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

ఉత్సవ విగ్రహాలుగా మిగిలిపోయాం

- సర్వసభ్య సమావేశంలో ఎంపీటీసీల ఆవేదన
- సభను బాయ్‌కాట్ చేసి నిరసన

కడ్తాల్: రాజ్యాంగ బద్ధంగా ఎన్నికైన ఎంపీటీసీలం.. విధులు, నిధులు, తగిన గౌరవం లేక ఉత్సవ విగ్రహాలుగా మిగిలిపోయామని ఎంపీటీసీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కమ్లీమోత్యానాయక్ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి జెడ్పీటీసీ దశరత్‌నాయక్, సింగిల్‌విండో చైర్మన్ గంప వెంకటేశ్‌గుప్త, వైస్ ఎంపీపీ ఆనంద్, ఎంపీడీఓ రామకృష్ణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సభ ప్రారంభం కాగానే కర్కల్‌పహాడ్ ఎంపీటీసీలు లచ్చిరామ్‌నాయక్, శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎంపీటీసీల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం చిన్నచూపు చూడటాన్ని నిరసిస్తూ సభను బాయ్‌కాట్ చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎంపీటీసీల పరిస్థితి అత్యంత దయనీయంగా మారిందని అన్నారు. నిధులు, విధులు, అధికారాలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వార్డు సభ్యులకు ఉన్న గౌరవం ఎంపీటీసీ సభ్యులకు లేకుండా పోయిందని.. కనీసం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేకంగా సీటు కూడా లేదని వాపోయారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేయాల్సిన గ్రాంట్స్ కూడా విడుదలకావడం లేదని వాపోయారు. మండల పరిషత్ కార్యాలయం ప్రధాన ద్వారం ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. వైస్ ఎంపీపీ ఆనంద్, ఎంపీటీసీలు శ్రీనివాస్‌రెడ్డి, గోపాల్, రాములుగౌడ్, మంజుల, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా తదితరులు ఉన్నారు.



మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఎంపీటీసీలు

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



ఉపాధ్యాయులతో విద్యార్థులు

తలకొండపల్లి: మండల పరిధిలోని పడకల్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 22 మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవరించారు. చక్కగా పాఠాలు బోధించి ఆకట్టుకున్నారు. అనంతరం సాయంత్రం ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థులు మాట్లాడారు. ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైందని, భవిష్యత్‌లో ఉపాధ్యాయులు కావాలనే కోరిక ఉందని ఆ దిశగా విద్యాభ్యాసం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పండుగ అంజయ్య, ఉపాధ్యాయులు వినోదుకుమార్, వనజ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

కడ్తాల్: కొలకులపల్లి గ్రామంలో రామాలయ పునర్నిర్మాణం, ఆలయ అభివృద్ధికి సంబంధించి గ్రామానికి చెందిన మసున వాసుదేవులు, భాగ్యమ్మ కుమారులు.. విష్ణుమూర్తి, జగదీశ్వర్, తిరుపతయ్య, సంతోష్, శ్రీకాంత్ రూ.1,51,116 విరాళంగా అందజేశారు. మంగళవారం గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ బట్టు కిషన్‌రెడ్డికి విరాళాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో చంద్రమౌళి, యాదయ్య, వెంకన్న, మల్లారెడ్డి, దానయ్య తదితరులు ఉన్నారు.



విరాళం అందజేస్తున్న దాతలు

ఎల్‌ఓసీ అందజేత

తుర్కయంజాల్: పేదలకు మెరుగైన వైద్యం అందించాలనేదే ప్రభుత్వ ఉద్దేశం అని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీ మునగనూర్‌కు చెందిన ఎస్.వెంకటేష్‌కు రూ.1.25 లక్షల ఎల్‌ఓసీని మంగళవారం ఎమ్మెల్యే అందజేశారు. నాయకులు రమేష్‌గౌడ్, నక్క శ్రీనివాస్‌గౌడ్, బీఆర్‌ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు వేముల అమరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ నిమిత్తం..

కడ్తాల్: ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని జంగారెడ్డిపల్లికి చెందిన కడారి మంగమ్మ అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. ఆపరేషన్ నిమిత్తం కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ దృష్టికి తీసుకువెళ్లగా.. సీఎంఆర్‌ఎఫ్ ద్వారా రూ.3.40 లక్షల ఎల్‌ఓసీని ఎమ్మెల్యే మంజూరు చేయించి మంగళవారం అందజేశారు. నిరుపేదలకు అండగా ఉంటామన్నారు. ఎంపీటీసీ కుమార్, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ సత్యం, నాయకులు రమేశ్, ప్రసాద్ ఉన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

కడ్తాల్: మండల సర్వసభ్య సమావేశం బుధవారానికి వాయిదా పడినట్లు ఎంపీడీఓ రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్పంచ్‌లు ఎంపీటీసీలు, అధికారులు తప్పకుండా హాజరుకావాలని కోరారు.

గడ్డివాము దగ్ధం

కడ్తాల్: ఆమనగల్లు పట్టణానికి చెందిన కావటి లక్ష్మయ్యకు చెందిన వ్యవసాయ పొలంలో గుర్తుతెలియని వ్యక్తులు మంగళవారం ఉదయం గడ్డివాముకు నిప్పు పెట్టడంతో పూర్తిగా దగ్ధమైంది.రూ.1.50లక్షల నష్టం వాటిల్లిందని బాధిత రైతు వాపోయాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాడు.

వీఆర్‌ఏ చెన్నయ్య మృతి

తలకొండపల్లి: మండల పరిధిలోని చంద్రధనకు చెందిన సర్పంచ్ బక్కికుమార్ తండ్రి చెన్నయ్య(86) అనారోగ్యంతో సోమవారం రాత్రి మృతిచెందాడు. మృతుడు చెన్నయ్య తలకొండపల్లి తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌ఏగా విధులు నిర్వహిస్తున్నాడు. తహసీల్దార్ కృష్ణ మంగళవారం చంద్రధనకు వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు దహన ఖర్చుల నిమిత్తం తక్షణ సహాయంగా రూ.10,000 అందజేశారు. బీజేపీ నేత తల్లోజు ఆచారి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర అదనపు కార్యదర్శి పాండు, బీజేవైఎం అసెంబ్లీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి అనిల్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలపై అవగాహన

కడ్తాల్: మండల పరిధిలోని ముద్విన్‌లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం–2023ను పురస్కరించుకుని మంగళవారం ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామంలో రోడ్‌షో నిర్వహించి చిరుధన్యాలపై ప్రచారం చేశారు. రాగులు, కొర్రలు, జొన్నలు, సజ్జలు, సామల ఉపయోగంపై ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఓ శ్రీలత, ఏఈఓలు రమణ, అభినవ్‌రెడ్డి, స్వాతి, చంధన తదితరులు ఉన్నారు.



కడ్తాల్: అవగాహన ర్యాలీలో పాల్గొన్న అధికారులు, రైతులు

ఆమనగల్లు మండలంలో..

ఆమనగల్లు మండల పరిధిలోని రాంనుతల గ్రామంలో అంతర్జాతీయ చిరుధాన్యాల దినోత్సవం –2023ను పురస్కరించుకుని వ్యవసాయ శాఖ అధికారులు మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సోనా శ్రీనివాస్, ఎంపీటీసీ సరితాపంతునాయక్, ఉప సర్పంచ్ రమేశ్, రైతుబంధు మండల కోఆర్డినేటర్ నారాయణ, గ్రామ కోఆర్డినేటర్ రాములు, ఏఓ అరుణకుమారి, వ్యవసాయ శాఖ అధికారులు ఉన్నారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం..

తలకొండపల్లి: చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని ఏఈఓ విజయ్ అన్నారు. జాతీయ ఆహార భద్రతా మిషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం 2023ను పురస్కరించుకొని మంగళవారం మండల పరిధిలోని దేవుని పడకల్ రైతువేదికలో చిరుధాన్యాల పంటలపై రైతులకు అవగాహన నిర్వహించారు. గ్రామంలో చిరుధాన్యాల పంటల సాగుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శంకర్, ఉప సర్పంచ్ తిరుపతి, కిషన్‌నాయక్, లక్ష్మయ్య, మాజీ ఎంపీటీసీ రవి, స్వామిగౌడ్, యాదిగిరి, శ్రీశైలం,నర్సింహ, రామస్వామి పాల్గొన్నారు.

కౌలు రైతులకు పట్టాలివ్వండి

అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత

యాచారం: నందివనపర్తి గ్రామంలోని ఓంకారేశ్వరాలయానికి చెందిన 1,400 ఎకరాల భూముల్లో కౌలు చేసుకుంటున్న రక్షిత కౌలు రైతులకు వెంటనే పట్టాలు ఇవ్వాలని తెలంగాణ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా అడిషనల్ కలెక్టర్ తిరుపతిరావుకు వినతి పత్రం అందజేశారు. నందివనపర్తి గ్రామంలోని ఓంకారేశ్వరాలయ పేరును రద్దు చేసి రైతులకు పట్టాలు అందజేయాలని కోరారు. ఓంకారేశ్వరాలయ భూముల్లో 60 ఏళ్లకు పైగా నందివనపర్తి, నస్దిక్‌సింగారం, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాలకు చెందిన 600 మంది రైతులు సాగు చేసుకుని జీవనోపాధి పొందుతున్నారని అన్నారు. చట్ట ప్రకారం వారికి 1950లోనే 37–ఏ సర్టిఫికెట్ వచ్చినట్లు తెలిపారు. రైతులకు పట్టాలు ఇవ్వకుండా అధికారులు 1953లో ఓంకారేశ్వరాలయం పేరుమీద 1,400 ఎకరాల భూములున్నట్లు రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేశారని అన్నారు. నాటినుంచి నేటి వరకు కౌలు రైతులు ఆ భూములనే నమ్ముకుని జీవనోపాధి పొందుతున్నారని అన్నారు. ఆలయ భూమిని యోగ్యంగా మార్చుకోవడం కోసం కౌలు రైతులు లక్షలాది రూపాయలు ఖర్చు చేసినట్లు తెలిపారు. పూర్తి విచారణ జరిపి కౌలు రైతులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు కె.భాస్కర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పి.అంజయ్య, ప్రజాసంఘాల నాయకులు పి.యాదయ్య, బి.సామేల్, డి.జగదీష్, ఆలంపల్లి నర్సింహ, జె.రాములు, ఎం, సురేష్, బుగ్గ రాములు, మల్లేష్, యాదయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.



అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు



ఉపాధ్యాయులను సన్మానించిన జెడ్పీహెచ్‌ఎస్ 1969-70 బ్యాచ్ విద్యార్థులు

అ‘పూర్వ’ సమ్మేళనం

కడ్తాల్: మండల పరిధిలోని ముద్విన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1969–70 హెచ్‌ఎస్‌సీ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు మంగళవారం పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల పరిధిలోని మైసిగండిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో దేశ విదేశాల్లో స్థిరపడిన అప్పటి హెచ్‌ఎస్‌సీ బ్యాచ్‌కు చెందినవారు పాల్గొన్నారు. అప్పట్లో తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు, అప్పటి మిత్రులు డాక్టర్ మశ్చేందర్‌రెడ్డి, రఘుమారెడ్డి, మోహన్‌రెడ్డి, భగవాన్‌రెడ్డి, సత్యానారాయణ, చంద్రారెడ్డి, శేఖర్‌రెడ్డి, చంద్రారెడ్డి, రాంరెడ్డి, నర్సిరెడ్డి, వెంకటయ్య, ధరమ్‌రాజ్, ప్రతీప్ మధుకర్, కృష్ణమూర్తి, నరోత్తంరెడ్డి, డాక్టర్ శ్రీనివాస్, మాధవ్‌రెడ్డి, సత్యానారాయణ, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

అనుమతి లేకుండా సమావేశం

సీపీఎం నాయకుల అరెస్ట్

హయత్‌నగర్: అబ్దుల్లాపూర్‌మెట్టు మండలం కుంట్లూర్ పాపయ్యగూడలో ఇటీవల పేదలు గుడిసెలు వేసిన విషయమై ఎలా ముందుకు వెళ్లాలో చర్చించేందుకు సమీపంలోని తట్టిఅన్నారంలో సమావేశమైన సీపీఎం నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్టేషన్‌కు తరలించారు. సీపీఎం జిల్లా నాయకులు ఏర్పుల నర్సింహ తెలిపిన వివరాల ప్రకారం... పేదలకు ఇళ్ల స్థలాలు, ఇవ్వాలని, అర్బన్‌లో ఇళ్ల పట్టాల పంపిణీ నిషేధాన్ని ఎత్తివేయాలనే డిమాండ్‌తో మహిళా సంఘం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 9న ఇందిరాపార్కు వద్ద ధర్నా నిర్వహించాలని సీపీఎం నాయకులు నిర్ణయించారు. ఈ మేరకు మంగళవారం అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తట్టిఅన్నారంలో సమావేశం నిర్వహించారు. విషయం తెలుసుకున్న పోలీసులు పెద్దఎత్తున అక్కడికి చేరుకుని సమావేశాన్ని చుట్టుముట్టారు. పోలీసుల రాకతో అక్కడివారు ఆందోళనకు గురయ్యారు. అనుమతి లేకుండా సమావేశం నిర్వహిస్తున్నారనే కారణంగా పోలీసులు నాయకులు నర్సింహతో పాటు మాజీ ఎంపీటీసీ ప్రభాకర్, బీఎస్పీ నాయకులు రవికుమార్, సౌజన్యను అదుపులోకి తీసుకుని హయత్‌నగర్ పోలీస్టేషన్‌కు తరలించారు.

సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తా

బీఆర్‌ఎస్ యువనేత ప్రశాంత్‌కుమార్‌రెడ్డి

యాచారం: నియోజకవర్గంలో ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు తెలియజేయడానికే ప్రగతి నివేదన పాదయాత్ర చేపట్టినట్లు బీఆర్‌ఎస్ యువనేత మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆయన చేపట్టిన పాదయాత్ర మంగళవారం గునుగల్, గడ్డమల్లయ్యగూడ గ్రామాల్లో కొనసాగింది. ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సాగర్ రోడ్డు నుంచి గునుగల్–లోయపల్లి రోడ్డు వెడల్పు కావడంతో ఎంతో అభివృద్ధి జరిగినట్లు తెలిపారు. రోడ్డు వెడల్పుతో వ్యవసాయ భూముల ధరలు కూడా పెరిగాయన్నారు. ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి కృషి వల్లే ఇది సాధ్యమైందన్నారు. గునుగల్‌లో ఆదర్శ పాఠశాల, గ్రామ పంచాయతీలకు నూతన భవనాలు నిర్మించారని అన్నారు. అనంతరం గ్రామ మాజీ సర్పంచ్ అచ్చెన మల్లికార్జున్ చిత్రపటానికి పూలమాలలేసి నివాళుర్పించారు.

యాచారంలో మంచి స్పందన..

ప్రగతినివేదన పాదయాత్రకు యాచారం మండల బీఆర్‌ఎస్ శ్రేణులు బాగా సహకరించారని మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆయా గ్రామాల్లో 500 మందికి పైగా డబుల్ బెడ్‌రూం ఇళ్లు కావాలని వినతి పత్రాలు ఇచ్చారని తెలిపారు. ఆయా గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వలు, కుల సంఘాల భవనాల నిర్మాణం కోసం రూ.కోటికిపైగా నిధుల హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డితో మాట్లాడి కావాల్సిన నిధులు మంజూరు చేయిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు చిన్నోళ్ల జంగమ్మ, యాచారం పీఏసీఎస్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు రమేష్‌గౌడ్, పాశ్చ భాషా, గునుగల్ గ్రామ సర్పంచ్ ఇందిర, ఉపసర్పంచ్ భీంయాదవ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రశాంత్‌కుమార్‌రెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న నేతలు

తులేకలాన్‌లో పాదయాత్ర..

ఇబ్రహీంపట్నం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి చేరవేస్తామని బీఆర్‌ఎస్ యువనేత మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సోమవారం రాత్రి యాచారం మండలం చింతుల్ల నుంచి ఇబ్రహీంపట్నం మండలంలోని తులేకలాన్‌లోకి ప్రగతినివేదన పాదయాత్ర చేరింది. ఈ సందర్భంగా తులేకలాన్ గ్రామానికి చెందిన టీఆర్‌ఎస్ నాయకులు, ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం గ్రామంలో పర్యటించారు. ఇంటింటికి తిరిగి ప్రజా సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, ఇబ్రహీంపట్నం ఎంపీపీ కృపేశ్, తులేకలాన్ సర్పంచ్ యాదగిరి, ఎంపీటీసీలు నాగమణి, చెరుకూరి మంగ రవీందర్, బీఆర్‌ఎస్ అధ్యక్షులు బుగ్గరాములు, మాజీ సర్పంచ్ బీరప్ప, ఉపసర్పంచ్ రాజిరెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ రవీందర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.